క్లుప్తంగా

ప్రార్థనాలయంలో కాలిన సామగ్రి

భైంసా/భైంసారూరల్: భైంసా మండలంలోని చింతల్‌బోరి గ్రామంలో బుధవారం తెల్లవారు జామున ఓ వర్గానికి చెందిన ప్రార్థనాలయంలో కొంత సామగ్రి కాలిబూడిదైంది. ప్రార్థనాలయం నుంచి పొగలు రావడంతో ప్రజలు అక్కడికి వెళ్లి పోలీసులకు సమాచారమివ్వగా.. భైంసారూరల్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని డాగ్‌స్క్వాడ్ బృందంతో వచ్చి తనిఖీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్, భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులు పుకార్లు నమ్మవద్దని.. జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని పోలీసులు తెలిపారు.

కూలీల హాజరు పెంచాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

కడెం: ఉపాధి పనులకు వచ్చే కూలీల హాజరు శాతం పెంచాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఖానాపూర్ క్లస్టర్ పరిధి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి పంచాయతీ నుంచి వంద మంది కూలీలు హాజరయ్యేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ ఓస ప్రసాద్, గంగాప్రసాద్, ఎంపీడీవోలు లింబాద్రి, వెంకటేశ్వర్లు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మద్యం తాగి నడిపితే జైలుకే

ముథోల్: మద్యం తాగి నడిపితే వాహనదారులను జైలుకు పంపిస్తామని ముథోల్ ఎస్సై తిరుపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నాయాబాది చౌరస్తా, బస్టాండ్ ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలతోపాటు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే ఆటోడ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బడ్జెట్ ప్రతుల దహనం



ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన బడ్జెట్ గ్రామీణ ప్రాంతాలకు నష్టం కలిగించేలా ఉందని ఆరోపించారు. ఉపాధిహామీ, ఆహార సబ్సిడీ, రైతులకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీలపై భారీ ఎత్తున కోత విధించడం ద్వారా గ్రామీణ ప్రజలకు నష్టం చేకూరుస్తుందని తెలిపారు. ఉపాధిహామీ, రైతులకు అందించే ఇన్‌పుట్ సబ్సిడీలోనూ కోత పెట్టిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, నర్సయ్య, రాజేశ్వర్, జాన్‌పాల్ తదితరులున్నారు.

క్రీడాసామగ్రి అందజేత

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లి శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలకు శ్రేయోభిలాషి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.15వేల విలువైన క్రీడాసామగ్రి అందజేశారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో సుభాష్ చేతుల మీదుగా ట్రస్ట్ సభ్యులు ప్రధానోపాధ్యాయులు భోజన్నకు కిట్ అందించారు. అలాగే ఇటీవల ఖేల్‌కుద్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పెండెప్ కాశీనాథ్, కొట్టే హన్మాండ్లు, దత్తు, రజనీకాంత్, నాగేశ్ తదితరులున్నారు.

'నూతన విద్యావిధానం రద్దు చేయాలి'

భైంసాటౌన్: నూతన జాతీయ విద్యావిధానంతో విద్యార్థులు నష్టపోతారని.. వెంటనే దాని అమలును రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు రాష్ట్రంలో అమలు చేయబోమని తెలంగాణ ప్రభుత్వం ఈ అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో వాగ్మారే మహేందర్, నవీన్, తదితరులు ఉన్నారు.

'కంటివెలుగు' పరిశీలన

లోకేశ్వరం: కంటివెలుగు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని లోకేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ అన్నారు. బుధవారం మండలంలోని నర్సింహనగర్‌తండాలోని కంటి వెలుగు వైద్యశిబిరాన్ని వైద్యాధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతిబాయి, పలువురు వైద్య సిబ్బంది ఉన్నారు.

తీరనున్న 'గిరి'పుత్రుల కష్టాలు

- రూ.ఐదు కోట్లతో రోడ్లు, వంతెనల నిర్మాణానికి ఐటీడీఏ గ్రీన్‌సిగ్నల్
- త్వరలో టెండర్లు పిలుస్తామంటున్న అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న అడవిబిడ్డలు



ఇప్పచెలిమకు వెళ్లే దారిలో వర్షానికి దెబ్బతిన్న వంతెన

సారంగపూర్: రోడ్లు లేక తమ గ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న గిరిజనుల కష్టాలను ఎట్టకేలకు ఐటీడీఏ గుర్తించింది. స్థానిక మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మండలంలోని పలు గిరిజన గ్రామాలకు రోడ్లు, వంతెనలు నిర్మించేందుకు ఐటీడీఏ రూ.ఐదు కోట్ల నిధులు కేటాయించింది. దీంతో తమ ఇబ్బందులు దూరం అవుతాయని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఇప్పచెలిమ గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డుపై లోలెవెల్ వంతెన కోతకు గురై ప్రమాదకరంగా మారింది. తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామస్తులు ఆ వంతెన మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు.

నిధులతో చేపట్టే పనులివీ..

మండలంలోని సాయినగర్ నుంచి మహవీర్‌తండా, దుర్గానగర్, నాగాపూర్, అడెల్లితండా, పెండల్‌దరి, ఇప్పచెలిమ, లక్ష్మీనగర్, అంతుల్వాయి, ఆదివాసీగూడలను కలుపుతూ 7.8 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేసేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. గిరిజన గ్రామాల మీదుగా వెళ్లే ఈ రోడ్డును నిర్మల్–స్వర్ణ ప్రధాన రహదారికి అనుసంధానించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ దిశగా ఇప్పటికే సర్వే పనులు ప్రారంభించినట్లు ఐటీడీఏ అధికారులు వెల్లడించారు.

లక్ష్మీనగర్– ఇప్పచెలిమ మధ్యలో వంతెన నిర్మాణం

ఇప్పచెలిమ – పెండల్‌దరి మధ్యలో రెండు లోలెవల్ వంతెనల నిర్మాణం

సాయినగర్ గ్రామం వద్ద మినీ వంతెన నిర్మాణం

15 గిరిజన గ్రామాలకు మేలు..

సారంగపూర్ మండలానికి మంజూరైన ఐటీడీఏ నిధులతో చేపట్టే పనులను అధికారులు గుర్తిస్తున్నారు. మండలంలో 22 గిరిజన గ్రామాలుండగా.. ఈ నిధులతో చేపట్టే పనులతో 15 గ్రామాలకు లబ్ధి కల్గుతుంది. పనుల గుర్తింపు సర్వే చివరి దశకు చేరిందని.. ఇప్పటికే నివేదిక సిద్ధం చేసి ఐటీడీఏకు అందజేశామని అధికారులు పేర్కొన్నారు. అయితే త్వరలో టెండర్లు పిలిచి పనులను ప్రారంభించే దిశగా కసరత్తు సాగుతోందన్నారు.



పెండల్‌దరి మీదుగా లక్ష్మీనగర్ వెళ్లే దారిలో కంకర తేలి అధ్వానంగా రోడ్డు

సులభతరం కానున్న రాకపోకలు..

ఏళ్లుగా రోడ్డు సరిగా లేకపోవడంతో ఆసుపత్రికి వెళ్లాలన్నా.. ఇతర ముఖ్యమైన పనుల సమయంలో తమ గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు గిరిజనులు కష్టాలు పడుతున్నారు. ఈ నిధులతో వంతెనలు, రోడ్ల నిర్మాణం చేపట్టనుండటంతో తమ కష్టాలు తీరుతాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

టెండర్లు పూర్తవగానే పనులు ప్రారంభిస్తాం

గిరిజన గ్రామాలను కలిపే బీటీరోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఇప్పటికే సర్వే పనులు మొదలయ్యాయి. ఇందుకోసం రూ.ఐదు కోట్ల పైచిలుకు నిధులు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేసి ఐటీడీఏకు అందజేశాం. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నాం.

– ప్రదీప్ రాథోడ్, ఐటీడీఏ ఏఈ

ఏళ్లుగా ఎదురుచూశాం

వర్షాకాలంలో మా గ్రామానికి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ రోడ్డు ఎప్పుడు బాగవుతుందా అని ఎదురుచూశాం. పలుమార్లు మంత్రి అల్లోలకు మొరపెట్టుకున్నాం. ఆయన చొరవతో నిధులు విడుదలయ్యాయి. త్వరలోనే గిరిజన గ్రామాల ప్రజల కష్టాలు గట్టెక్కుతాయి.

– గంగారాం, పెండల్‌దరి సర్పంచ్

యువత ఆటలపై ఆసక్తి పెంచుకోవాలి

- భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

భైంసాటౌన్: యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఆటలపై ఆసక్తి పెంచుకోవాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. బుధవారం భైంసాలోని పార్డి(బి) బైపాస్‌రోడ్డులో సయ్యద్ ఇర్ఫాన్ అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ పోటీలను ఏఎస్పీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భైంసా ప్రాంతాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అంతకుముందు ప్రారంభోత్సవానికి హాజరైన పలువురు ఎంఐఎం, బీజేపీ కౌన్సిలర్లను నిర్వాహకులు సయ్యద్ ఇర్ఫాన్ మెమోంటోలతో సత్కరించారు. మొదటిరోజు పోటీలో నాందేడ్, భోకర్ జట్లు తలపడ్డాయి.



అంతర్రాష్ట్ర పోటీలు ప్రారంభించి బ్యాటింగ్ చేస్తున్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఖానాపూర్–జగిత్యాల బస్సు ప్రారంభం

కడెం: నిర్మల్ డిపో నుంచి ఖానాపూర్–జగిత్యాలకు నూతన బస్సు సర్వీసు ప్రారంభించినట్లు డిపో మెనేజర్ సాయన్న తెలిపారు. ఖానాపూర్ నుంచి ఉదయం ఎనిమిది గంటలకు, మధ్యాహ్నం 1:30 గంటలకు, జగిత్యాల నుంచి ఉదయం 11:30 గంటలకు, సాయంత్రం 4:30 గంటలకు బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఖానాపూర్ నుంచి బయలుదేరి వయా లింగాపూర్, చిట్యాల్, బెల్లాల్, బోర్నపల్లి, రాయికల్ మీదుగా బస్సు రోజు రెండు ట్రిప్పులు నడుస్తుందని.. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని లింగాపూర్ గ్రామస్తులు బస్సుకు స్వాగతం పలికారు. బస్సు రాకకు కృషి చేసిన జగిత్యాల డీటీవో శ్యాంనాయక్, ఎమ్మెల్యే రేఖానాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్టీసీ కంట్రోలర్ శంకర్‌నాయక్, ఉపసర్పంచ్ రంజిత్, లచ్చన్న, తదితరులు ఉన్నారు.



బస్సుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఇంటిపన్నులు వసూలు చేయాలి

తానూరు: గ్రామాల్లో వందశాతం ఇంటిపన్నులు వసూలు చేయాలని డీపీవో శ్రీలత అన్నారు. బుధవారం మండలంలోని మొగ్లి గ్రామం సందర్శించారు. ముందుగా పంచాయతీ కార్యాలయంలో అభివృద్ధి పనులకు ఖర్చు చేసిన నిధుల వివరాలను తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు మురికి కాలువలను శుభ్రపరిచడంతోపాటు తడి,పొడి చెత్తతో సెగ్రిగేషన్ షెడ్డులో సేంద్రియ ఎరువులు తయారు చేయాలన్నారు. హరితహారం కోసం నర్సరీల్లో మొక్కలు నాటి ఎండిపోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఎంపీవో మోహన్‌సింగ్, సర్పంచ్ పుండలిక్, కార్యదర్శి విఠల్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో శ్రీలత

కరెంట్ కోతలను నిరసిస్తూ ధర్నా

లోకేశ్వరం: అప్రకటిత కరెంటు కోతలను నిరసిస్తూ బుధవారం మండలకేంద్రంలోని పాతబస్టాండ్ సమీపంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మురళీమోహన్ మాట్లాడుతూ రైతుల పంటలు ఎండిపోయి నష్టపోతుంటే తెలంగాణ ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషిస్తుందన్నారు. త్రీఫేజ్ కరెంట్ ఎప్పుడు వచ్చి పోతుందో తెలియడం లేదని పేర్కొన్నారు. నాయకుల ధర్నాతో వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న లోకేశ్వరం ఏఎస్సై దిగంబర్‌పటేల్ సిబ్బందితో వెళ్లి.. సంఘం నాయకులను సముదాయించడంతో వారు ధర్నా విరమించారు. ఈ ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముత్తన్న, ప్రసాద్, దేవేందర్, సాయన్న, మహిరాజ్, గంగాధర్ పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించిన కార్మికసంఘం నాయకులు

మహిళలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. బుధవారం ఖానాపూర్‌లోని తన నివాసంలో 90రోజుల టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న నిరుపేద ఎస్సీ మహిళలకు సన్‌స్కిల్స్ ఇన్‌స్టిట్యూట్, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 35 ఉచిత కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన రైతునేస్తం విగ్రహాన్ని ఆవిష్కరించారు. మన ఊరు– మన బడిలో భాగంగా బాదన్‌కుర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్ ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామంలోని రజక సంఘ భవనానికి రూ.రెండు లక్షల ప్రొసీడింగ్ అందించి భూమిపూజ చేశారు.



మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్న ఎమ్మెల్యే

కంటివెలుగు శిబిరాన్ని తనిఖీ చేసి నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ హన్మండ్లు, మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ కలీల్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుప్పాల లక్ష్మి, వైస్ చైర్మన్ గౌరై గంగాధర్, బాదన్‌కుర్తి సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ రాణి, ఉపసర్పంచ్ నవీన్, వెంకాగౌడ్, రామునాయక్, సురేశ్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

కడెం: బీఆర్‌ఎస్‌తోనే దేశ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. అనంతరం కొత్త మద్దిపడగలో వివిధ పార్టీలకు చెందిన సుమారు వంద మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు రఫీక్ అహ్మద్, టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, ఆత్మ కమిటీ చైర్మన్ సతీశ్, సర్పంచ్‌లు వెంకటేశ్, రాజమణి, లచ్చన్న, స్టీఫెన్, ఇందూర్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే ప్రజాసంక్షేమం

- ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి

కుభీర్: ప్రజాసంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ముథోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాలేగాంలో కోటి రూపాయలతో నిర్మించే విద్యుత్ సబ్‌స్టేషన్‌కు బుధవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం రూ.77లక్షలతో ఉన్నత పాఠశాల భవనం, రూ.19లక్షలతో చేపట్టే ప్రాథమిక పాఠశాల భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మహారాష్ట్రలోని కిని, భోకర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ సమావేశాలకు వచ్చిన అక్కడి సర్పంచ్‌లు తెలంగాణ సంక్షేమ పథకాలను చూసి ఆశ్చర్యపోయారని పేర్కొన్నారు. ఇటీవల బీజేపీ నాయకులు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని దరఖాస్తులు తీసుకుంటున్నారని.. వారి మాటలు నమ్మవద్దన్నారు. మాలేగాం రైతులకు కోసం లిఫ్ట్ ఎరిగేషన్, కమ్యూనిటీహాళ్లు, సీసీ రోడ్లు మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణకళాగంగారావ్, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, డీఈ గంగాధర్‌గౌడ్, ఏఈ మహేశ్, ఏఈ అజీజొద్దీన్, ఆనంద్, రమేశ్, ప్రధానోపాధ్యాయుడు పోశెట్టి ఉన్నారు.



మాలేగాంలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కుంటాల: ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఓలా పంచాయతి పరిధిలోని రాజాపూర్ తండాలో సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. కుంటాల శివారు నుంచి రాజాపూర్ తండా వరకు నిర్మించే రోడ్డుకు రూ.కోటి 16లక్షల ఐటీడీఏ నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. సాంకేతిక కారణాలతో జాప్యం జరిగిందని.. సాగుకు 24 గంటల కరెంట్ అందిస్తామని అన్నారు. ఎంపీపీ అప్పగజ్జారాం యాదవ్, సర్పంచ్‌లు కనీష్ ఫాతిమా, హైమద్, బాపురావ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు జీవి రమణరావు, దత్తాత్రి, వెంకటేశ్, రాంజీ, ఏవో సోమలింగారెడ్డి, ఎంపీవో రహీం తదితరులు పాల్గొన్నారు

సర్కారు బడుల్లో అన్ని సౌకర్యాలు

భైంసాటౌన్: సర్కారు బడుల్లో అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఈమేరకు పట్టణంలోని ఓవైసీనగర్‌లో మన బస్తీ–మన బడి కింద రూ.27లక్షలతో పనులు పూర్తి చేసుకున్న ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం వార్డు కౌన్సిలర్లు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఫారూక్, ఆసిఫ్, కౌన్సిలర్లు అమీర్, మాజిద్, ఫైజుల్లాఖాన్, నాయకులు ఇర్ఫాన్ సయ్యద్, డీఈఈ సురేశ్‌కుమార్, ఏఈ భార్గవ్ పాల్గొన్నారు.

కుష్ఠు బాధితులు ఆందోళన చెందవద్దు

నిర్మల్‌రూరల్: కుష్ఠు వ్యాధిగ్రస్తులెవరూ ఆందోళన చెందవద్దని.. సకాలంలో వైద్య చికిత్స తీసుకుంటే ఆరు నెలల నుంచి ఏడాదిలోగా వ్యాధిని నివారించవచ్చని బంగల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు వన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం లేప్రా సొసైటీ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రారంభదశలో వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. కుష్ఠు మచ్చలపై ఎలాంటి స్పర్శ, నొప్పి ఉండదన్నారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణి, పారామెడికల్ అధికారి రాజేశ్వర్, లేప్రా పీటీ కిషన్‌రావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యురాలు వన్య

అటెన్షన్ ప్లీజ్..

పగలే వెన్నెల



తానూరు: మండలంలోని మహలింగి గ్రామంలో బజార్‌లైన్‌కు ఆన్‌ఆఫ్ పరికరాలు లేకపోవడంతో విద్యుత్ దీపాలు మధ్యాహ్నం కూడా వెలుగుతున్నాయి. రోజంతా దీపాలు వెలుగుతుండటంతో లోఓల్టేజీ సమస్య ఏర్పడుతోందని గ్రామస్తులు వాపోతున్నారు.అధికారులు స్పందించి బజార్‌లైన్‌కు ఆన్‌ఆఫ్ ఏర్పాటు చేసి విద్యుత్ ఆదా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: ప్రదీప్, విద్యుత్ ఏఈ, ఫోన్: 94408 14880

రేపటి నుంచి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో శ్రీ వెంకట లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఈనెల మూడో తేదీ నుంచి ఐదో తేదీ వరకు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పండితులు చక్రపాణి నర్సింహమూర్తి, విష్ణుభట్ల రాజశేఖరశర్మ బృందం ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 3న లక్ష్మీనర్సింహస్వామి ప్రతిమ ఊరేగింపు, గణపతి, విశ్వక్సేన ఆరాధన పుణ్యాహవచనం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, జలాధివాసం, అగ్నిప్రతిష్ఠ, 4న కర్మనా పుణ్యాహవచనం, మండపార్చనలు, సుదర్శన, నరసింహ హోమం, ధాన్యఫల, పుష్ప శయ్యాదివాసములు, మహిళల సామూహిక కుంకుమార్చన, 5న కర్మణపుణ్యాహవచనం, గర్త సంస్కారము, స్థిర యంత్రమూర్తి ప్రాణప్రతిష్ఠం, ప్రతిష్ఠాంగ హోమాలు, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, వెంకటలక్ష్మి నర్సింహస్వామి శాంతి కల్యాణం, వేదఆశీర్వచనం తదితర కార్యక్రమాలు ఉంటాయని.. భక్తులు తరలిరావాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన సీఐ

కడెం: మండలంలోని నవాబ్‌పేట్ గ్రామంలోని సత్యం ట్రెడిషనల్ ట్రీట్‌మెంట్ యోగాశ్రమం క్యాలెండర్‌ను బుధవారం ఖానాపూర్ సీఐ అజయ్‌బాబు ఆవిష్కరించారు. పేదలకు వైద్యం అందిస్తున్న రాపెల్లి సత్యంను సీఐ అభినందించారు. కార్యక్రమంలో రఘువీర్, కల్యాణ్ తదితరులు ఉన్నారు.

భాషాపండితులు, పీఈటీల నిరసన

తానూరు: తమకు ప్రమోషన్లు ఇవ్వడం లేదని నిరసిస్తూ బుధవారం భాషా పండితులు, పీఈటీ ఉపాధ్యాయులు 9,10 తరగతులకు బోధన నిలిపివేశారు. తెలుగు, పీఈటీల ఐక్యవేదిక పిలుపు మేరకు బుధవారం తాము విధులు నిర్వర్తిస్తున్న పాఠశాలల్లో నిరసన తెలిపారు. తెలుగు ఫోరం జిల్లా అధ్యక్షులు గంగుల చిన్నన్న మాట్లాడుతూ కోర్టు కేసులు ఉన్నాయనే సాకుతో ప్రభుత్వం భాషా పండిట్లకు, పీఈటీలకు మొండిచెయ్యి చూపడం సరికాదన్నారు. అనంతరం హెచ్‌ఎం సుభాశ్‌మోస్లేకు వినతిపత్రం అందజేశారు. సోక్ కాంబ్లెశామ్, రవీందర్, సంజు, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: భాష పండితుల పోస్టులను ఉన్నతీకరించాలని కల్లూర్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు తిరుమల్‌రెడ్డికి అక్కడ పనిచేస్తున్న భాషా పండితులు వినతిపత్రం అందజేశారు.

ప్రహరీ పనులకు భూమిపూజ

భైంసాటౌన్: పట్టణంలోని గోపాల్‌నగర్‌లో శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులకు నాలు గోవార్డు కౌన్సిలర్ చందూలాల్ బుధవారం భూమిపూజ చేశారు. రూ.14లక్షలతో ప్రహరీ తోపాటు స్వాగతతోరణం నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. పనులు త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ ఇంజినీర్ ఉదయ్‌కుమార్‌ను కోరారు. వారి వెంట కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు గంగాధర్, తదితరులున్నారు.

పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్‌కు చెందిన సాయినాథ్ ఇటీవల గుండెపోటుతో మరణించగా బాధిత కుటుంబసభ్యులను మేరు కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ పరామర్శించారు. వారి వెంట మేరు కుల సంఘం మండలాధ్యక్షుడు శివకుమార్, సాయినాథ్, భోజరాం ఉన్నారు.